క్లుప్తంగా

పక్కాగా మెనూ అమలు చేయాలి



వేపాడ ప్రాథమిక పాఠశాలలో వంటలను రుచి చూస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ-2 బాలభాస్కరరావు వంట నిర్వాహకులకు సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల, సోంపురం ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన వంటలను, విద్యార్థుల హాజరు రికార్డులను, వర్క్‌బుక్స్, సోంపురంలో నాడు–నేడు పనులను పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం తులసి, ఉపాధ్యాయులు ఉన్నారు.

శాకంబరీ దేవిగా యల్లారమ్మ



శాకంబరీ దేవిగా దర్శనమిస్తున్న యల్లారమ్మ

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన జామి యల్లారమ్మ అమ్మవారు బుధవారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

75శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు

చీపురుపల్లి: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పాడి రైతులకు పశుగ్రాసాభివృద్ధిపై పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ వై.వి.రమణ బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలను రైతు భరోసా కేంద్రంలోనూ ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. పాడి పోషణలో యాభై శాతం ఖర్చు దాణాలకే సరిపోతోందని, పాడి రైతులు మొక్కజొన్న వంటి పశుగ్రాసాలు సాగు చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు పశుగ్రాస విత్తనాల కిట్లను అందజేశారు. ఏడీ డాక్టర్ ఆర్.శారద, పశువైద్యులు జయకాంత్, హైమావతి, ఏహెచ్‌ఏలు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

వేపాడ: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని, ప్రకృతివ్యవసాయంపై రైతులు దృష్టిసారించేలా క్షేత్రస్థాయిలో వీఓఏ(గ్రామైక్య సంఘాల అధ్యక్షులు)లు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనంద్ కోరారు. స్థానిక వెలుగు భవనంలో వీఓఏలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందులు వాడడం వల్ల వాటి అవశేషాలు పంటల్లో ఉండి పోతాయని, వాటిని తినడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్రతీ రైతు వరి నాట్లు వేయడానికి ముందు పొలాల్లో నవధాన్యాలు సాగు చేసేలా చూడాలని కోరారు. ఏపీఎం శ్రీనివాసరావు, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

గుర్ల: మండలంలోని పకీరు కిట్టాలి మాజీ ఎంపీటీసీ రాగోలు నారాయణ బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు నివాళులర్పించారు. ఆమె మృతిపై మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

పవన్ క్షమాపణ చెప్పాల్సిందే..

- గరివిడిలో వలంటీర్ల నిరసన



పవన్‌పై ఎస్‌ఐ దామోదరరావుకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

చీపురుపల్లిరూరల్(గరివిడి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. పవన్ అనుచిత వ్యాఖ్యలపై గరివిడి పట్టణంలో మండల వలంటీర్లు బుధవారం నిరసన తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి సినిమా హాల్ జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి స్వార్థం లేకుండా నిష్పక్షపాతంగా సేవలందిస్తున్న తమపై పవన్ నోటికొచ్చినట్లు ఏది పడితే అది మాట్లాడడం తగదన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పవన్‌కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ ఎల్.దామోదరరావుకు ఫిర్యాదు చేశారు.వలంటీర్ల నిరసనకు జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, పొన్నాడ కుమార్, కడుమల రాంబాబు, పి.కుమార్, బమ్మిడి కార్తీక్, వలిరెడ్డి లక్ష్మణ, గేదెల ఆదినారాయణ తదితరులు సంఘీబావం తెలిపారు.

స్వార్థం లేని సేవామూర్తులు

వలంటీర్ వ్యవస్థ నిస్వార్థ సేవకు పర్యాయపదంగా మారింది. కరోనా కష్టకాలంలో బంధువులే పట్టించుకోకపోయినా మేమున్నాం అంటూ తమ ప్రాణాలను పణంగా పెట్టి కరోనాతో హోమ్ ఐసోలేషన్‌లో ఉన్న వారికి మందులు, నిత్యావసర సరుకులను అందించి శభాష్ అనిపించుకున్నారు. పింఛన్ లబ్ధిదారుల్లో కొంతమంది అనారోగ్య సమస్యలతో పక్క జిల్లాలు, రాష్ట్రాల ఆస్పత్రుల్లో చికిత్స తీసుకునే సమయంలో వారికి వలంటీర్లు తమ సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. వైఎస్సార్ బీమాలో చేర్పించడం, రేషన్ కార్డులు మంజూరు చేయడం, కుల ,ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువపత్రాలు ఇంటివద్దకే అందిస్తున్నారు. ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఈ సేవలు అందిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని తమ రాష్ట్రాల్లో ప్రవేశపెట్టే ఆలోచన చేస్తున్నాయి. వలంటీర్ల సేవలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ల ద్వారా తమ సమస్యలు పరిష్కారమైన తీరు ప్రజల మాటల్లో...

– సాక్షి నెట్‌వర్క్

వారి సాయం మరచిపోలేం..



కరోనా లాక్‌డౌన్ సమయంలో మా వలంటీర్ యమున మా కుటుంబానికి చేసిన సాయం మరచిపోలేం. ఆటోలు, బస్సులు తిరగకపోయినా, బంధువులు కూడా పట్టించుకోని సమయంలో మా కుటుంబానికి కావాల్సిన మందులు, ఇతర సామగ్రిని ఇంటికి వచ్చి వలంటీర్ అందించింది. వలంటీర్ల వల్ల ప్రతి కుటుంబానికీ సేవలు అందుతున్నాయి.

– పెదిరెడ్ల సింహాచలం, పాత సుంకరపాలెం, కొత్తవలస మండలం

కష్టకాలంలో అండగా నిలిచారు



వలంటీర్లు సేవలు చాలా బాగున్నాయి. కరోనా వంటి కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచి సేవలందించారు. నాకు కాలు విరిగిపోవడంతో చికిత్స కోసం విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో జాయిన్ అయ్యాను. ఆ సమయంలో మా వలంటీర్ గణపతి తన సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని విశాఖపట్నం వచ్చి పింఛన్ డబ్బులు అందించారు. పథకాలకు దరఖాస్తు చేసేటప్పుడు, ఇతర ప్రభుత్వ సేవలను ఒక్క రూపాయి కూడా ఆశించకుండా సేవలు అందిస్తున్నారు.

– దరిమిరెడ్డి అప్పారావు, జన్నివలస, జామి మండలం

రేషన్‌కార్డు సమస్య పరిష్కరించారు



మాఅబ్బాయికి వివాహం అయ్యాక రేషన్ కార్డులో మాకోడలును చేర్చేందుకు ఇబ్బంది అయ్యింది. ఎలా చేయాలో మాకు తెలియదు. రేషన్ కార్డులో మాకోడలు పేరును చేర్చమని మా వలంటీర్ కల్యాణికి చెప్పాను. ముందు కార్డులో నుంచి మా అబ్బాయి వివరాలు తొలగించారు. తర్వాత మా అబ్బాయి, కోడలు వివాహ సర్టిఫికెట్, పెళ్లి ఫొటోలు, ఆధార్ కార్డులను వలంటీరే సచివాలయానికి సమర్పించి రేషన్ కార్డులో వారిద్దరి పేర్లను చేర్చారు. అన్ని ప్రభుత్వ సేవలను, పథకాలను ఇంటివద్దకే అందిస్తున్నారు.

– ఇప్పిలి సన్యాసమ్మ, ఎం.పాలెం, మెరకముడిదాం మండలం

వలంటీర్ కృషితోనే...



నా ఆధార్ కార్డులో వివరాలు తప్పుగా నమోదు కావడంతో గత ప్రభుత్వంలో పింఛన్ అందుకోలేకపోయాను. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లను నియమించారు. మా వలంటీర్ రామప్పడు నన్ను స్వయంగా ఆధార్ సెంటర్‌కు తీసుకువెళ్లి ఆధార్‌లో సమస్యను పరిష్కరించా రు. తనే పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. వలంటీర్ కృషితోనే నేడు నాకు చర్మకారుల పింఛన్ మంజూరైంది. ప్రతీ నెల ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు అందిస్తున్నారు.

– బీంపల్లి రమణ, కుమరాం గ్రామం, గరివిడి మండలం.

సక్రమంగా విధులు నిర్వర్తించకుంటే చర్యలు



'ఫ్యామిలీ డాక్టర్' వైద్యశిబిరంలో ఓపీ వివరాలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

మెరకముడిదాం: సక్రమంగా విధులు నిర్వర్తించని వైద్యసిబ్బందిపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు మెరకముడిదాం పీహెచ్‌సీ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. పీహెచ్‌సీలో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ఇటీవల పీహెచ్‌సీ నుంచి బదిలీపై వెళ్లిన వారు, ఏయే పోస్టులు ఖాళీగా ఉన్నాయన్న వివరాలతో నివేదిక తయారు చేసి తనకు గురువారం అందజేయాలని వైద్యాధికారి అజిత్‌బాబును ఆదేశించారు. సిబ్బందితో మాట్లాడుతూ ఏ ఒక్కరూ డబుల్ డ్యూటీలు చేయవద్దని, ఎవరు విధులు వారు నిర్వర్తించాలని, వైద్యసేవలు అందించేటప్పుడు అవసరమైతే ఫార్మాసిస్ట్, ఏఎన్‌ఎంల సహకారం తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకు ముందు సోమలింగాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు.

గిరిశిఖర గ్రామంలో ఫీవర్ సర్వే



గుడిలోవలో తాగునీటి బావిలో క్లోరినేషన్ చేస్తున్న వైద్యసిబ్బంది

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ ఎస్.కోట పరిధిలోని గిరిశిఖర గ్రామం గుడిలోవలో కొట్టాం పీహెచ్‌సీ వైద్యురాలు జె.హారిక ఆదేశాలతో క్షేత్రస్థాయి సిబ్బంది బుధవారం గ్రామంలో ఫీవర్, ఎల్‌సీడీసీ సర్వేలు నిర్వహించారు. జ్వరపీడితుల నుంచి రక్త పూతలు సేకరించారు. వైద్యశిబిరం నిర్వహించి ప్రజలకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్నందున కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, గ్రామంలో ఎవరికి ఆరోగ్యం బాగోలేకున్నా వెంటనే ఆశ వర్కర్‌తో వైద్య సిబ్బందికి వెంటనే సమాచారం పంపాలని ఎంపీహెచ్‌ఏ టి.శంకరరావు ప్రజలకు సూచించారు. గ్రామంలో ఉన్న తాగునీటి బావిని క్లోరినేషన్ చేశారు. ఆశ వర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంట్యాడ: మండలంలోని కొరారుబిల్లి జంక్షన్‌కు గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ కె.ప్రసన్న కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తర్ణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ స్తంభం మీదపడి వ్యక్తికి గాయాలు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట రామాలయం సమీపంలో విద్యుత్ స్తంభాలను మార్చుతున్న సమయంలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు..పాత విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త విద్యుత్ స్తంభం అమర్చుతుండగా అదే సమయంలో అటు వైపుగా వస్తున్న స్థానికుడు సబ్బి అప్పారావుపై పాత స్తంభం విరిగిపడి పోయింది. దీంతో ఆయన తలకు, పక్కటెముకులకు గాయాలయ్యాయి. బాధితుడిని విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉందని స్థానికులు చెబుతున్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



జామిలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

జామి: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక విశాఖ–రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిలో బుధవారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటి, వాటి పరిరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు.పచ్చదనం, ఆహ్లాదవాతవరణం కోసం రహదారులకు ఇరువైపులా, పాఠశాలలు ,కార్యాలయాల వద్ద మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. కంటకాపల్లి–కొర్లాం సెక్షన్ పరిధిలో రహదారులకు ఇరువైపులా 24 కిలోమీటర్ల మేర మూడు లక్షలు మొక్కలు నాటుతున్నట్లు వివరించారు ఆర్డీఓ ఎం.సూర్యకళ, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డిప్యూటీ మేనేజర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ జి.హేమంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి హాని తలపెట్టవద్దు

చీపురుపల్లి: పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించి పర్యావరణానికి పరిరక్షించుకోవాలని ఏటీసీహెచ్.రఘునాథ్ అన్నారు. ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ప్లాస్టిక్ వద్దు..కాగితం కవర్లు ముద్దు



ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించాలని ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు

శృంగవరపుకోట: ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని స్థానిక రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు పట్టణంలో బుధవారం ర్యాలీ చేశారు. 'ప్లాస్టిక్ వద్దు– కాగితపు సంచులే ముద్దు' అని, ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని ఎలా పాడుచేస్తోంది, కాగితం మనకి ఎలా మేలు చేస్తుందో వివరిస్తూ నినాదాలు చేశారు. రవీంద్రభారతి విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జ్ వెంకటేష్, ప్రిన్సిపాల్ డి.శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21 నుంచి ఓటర్ల జాబితాపై ఇంటింట సర్వే

- రాజకీయపార్టీ నాయకుల సమావేశంలో ఆర్డీఓ అప్పారావు



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఆర్డీఓ అప్పారావు

చీపురుపల్లి: ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా పక్కాగా జాబితా సిద్ధం చేసేందుకు జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింట సర్వే నిర్వహించనున్నారని ఆర్డీఓ ఎం.అప్పారావు చెప్పారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తదితర అంశాలపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొత్త ఓటర్ల జాబితాలతో జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు ప్రతీ ఇంటికి బీఎల్‌ఓలు వస్తారని, ఓటర్లు తమ పేర్లు, ఆధార్ నంబర్లు, ఇంటి పేర్లు తదితర వివరాలు జాబితాలో సరిగా ఉన్నవీ లేనిదీ సరిచూసు కోవాలన్నారు.సర్వే సమయంలో రాజకీయ పార్టీల నాయకులు కూడా ఉండి బీఎల్‌ఓలకు సహకరించాలన్నారు.ఎక్కడైనా అర్హత లేని వారికి ఓట్లు ఉంటే వాటిపై రాజకీయ పార్టీలు ఫిర్యాదు అందిస్తే అలాంటి ఓట్లను తొలగిస్తామని చెప్పారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్న సంఘటనల్లో ఆధారాలతో సహా ఆర్డీఓ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తే విచారణ చేసి ఒక చోట ఓటు హక్కు ఉంచి, మరోచోట తొలగిస్తామని వివరించారు. పోలింగ్ కేంద్రాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల సమయంలో పార్టీలు నియమించుకునే పోలింగ్ ఏజెంట్ల వివరాలను తక్షణమే ఆర్డీఓ కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఏజెంట్ల వివరాలు తమ వద్ద ఉంటే సమర్థవంతమైన పోలింగ్‌కు అవసరమైన సమాచారం ఎప్పటికప్పుడు వారికి అందజేస్తామని తెలిపారు. మరణించిన వారి ఓట్లు తొలగించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. 1200 ఓట్లు దాటి ఉన్న పోలింగ్ కేంద్రాల విభజన కోసం గ్రామస్తుల దరఖాస్తు మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. చీపురుపల్లి, గరివిడి తహసీల్దార్‌లు ఎం.సురేష్, టి.గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, బెల్లాన బంగారునాయుడు, టీడీపీ నాయకులు వెన్నె సన్యాసినాయుడు, గవిడి నాగరాజు, చల్ల శ్రీరామ్, బీజేపీ నాయకులు ఇప్పిలి నీలకంఠం, రాజు, జనసేన నాయకులు విసనగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా రీసర్వే పూర్తిచేయండి



జామి: రీసర్వే వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి

జామి: సమగ్ర భూరీసర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ ఎం.సూర్యకళతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. మండలంలో ఇప్పటి వరకు చేపట్టిన రీసర్వేకు సంబం ధించిన వివరాలను తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్వేకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ పనులను దశల వారీగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

శృంగవరపుకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం సాయంత్రం సందర్శించారు. మండలంలో చేపడుతున్న సమగ్రభూరీసర్వేపై అధికారులతో ఆమె సమీక్షించారు. మండలంలో రీసర్వే జరిగిన గ్రామాలు, ఆయా గ్రామాల్లో వస్తున్న ఫిర్యాదులు, పరిష్కార చర్యలపై తహసీల్దార్ శ్రీనివాసరావు, రీసర్వే డీటీ, మండల సర్వేయర్‌ను ఆమె ఆరా తీశారని, సర్వేపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు



వేపాడ: వావిలపాడులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సేవలు ప్రజలకు ఇంటివద్దకే ఉచితంగా అందుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. వీలుపర్తి, వావిలపాడు గ్రామ సచివాలయాల్లో బుధవారం 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహించారు.అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను అందించడంతో పాటు పథకాలకు సంబంధించి ఏమైని సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. పలువురికి వివిధ ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. స్థానిక సర్పంచ్‌లు బీల రాజేశ్వరి, శానాపతి లీల, ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ పట్నాయక్, డీటీ సన్యాసిరావు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు,జేసీఎస్ కన్వీనర్ బి.శ్రీను పాల్గొన్నారు.

1,250 మందికి ధ్రువ పత్రాలు



జామి: భీమసింగిలో ప్రజలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సరయు

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో బుధవారం'జగనన్న సురక్ష' క్యాంపు నిర్వహించారు. జెడ్పీటీసీ గొర్లె సరయు హాజరై గ్రామంలో 1,250 మందికి వివిధ రకాల ధ్రువ పత్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్,డీసీసీడీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, స్థానిక సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అవగాహన

చీపురుపల్లి రూరల్ (గరివిడి): జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం, కోడూరు, దువ్వాం, తోండ్రంగి పంచాయతీల్లో వలంటీర్లు,గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు మండల జేసీఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్ బుధవారం అవగాహన కల్పించారు. ప్రజలకు 11 రకాల ధ్రువపత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందించనుందని, ఇంటింటికీ వెళ్లి ఎవరికి ఏయే ధ్రువ పత్రాలు కావాలో నమోదు చేసుకుని వాటి మంజూరుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఆయా పంచాయతీల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



కొత్తవలస: కేజీబీవీలో ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



చీపురుపల్లి: అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి హేమసుందర్

చీపురుపల్లి: అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ప్రమాద సమయంలో నివారణ చర్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అగ్నిమాపకశాఖాధికారి హేమసుందర్ అన్నారు. పట్టణంలోని ఎస్.వి.ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేసినప్పుడే లీకేజీలు ఉన్నాయో లేదో పరిశీలించాకే సిలిండర్ తీసుకోవాలని సూచించారు. వంట పూర్తయిన తర్వాత తప్పనిసరిగా సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలని, ఇళ్లల్లో నాణ్యత కలిగిన విద్యుత్ వైరింగ్ చేయించుకోవాలన్నారు. నాణ్యత లేని వైరింగ్‌తో షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో వ్యవహరించాలి

కొత్తవలస: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు లోనవకుండా సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని కొత్తవలస అగ్నిమాపకశాఖ అధికారి అశోక్‌కుమార్ సూచించారు. మండలంలోని అడ్డూరువానిపాలెం గ్రామ సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థినులకు అగ్నిమాపక సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ఇంట్లో వంట చేసే సమయాల్లో గ్యాస్ సిలిండర్ నుంచి ప్రమాదవశాత్తు మంటలు ఎగసిపడేటప్పుడు అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లుపాలెంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' రేపు

బొండపల్లి: గొల్లుపాలెం గ్రామంలో శుక్రవారం ఉదయం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఎంపీపీ చల్లా చలంనాయుడు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపా రు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్ బాబు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రజాసంక్షేమమే పరమావధి


మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మనప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

లక్కవరపుకోట: ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నర్సంపేట గ్రామంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు, ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మండల, స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, పథకాల అమలు తీరు ఎలా ఉంది, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. పథకాల అమలు తీరు భేషుగ్గా ఉందని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు బదులిల్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, పేదల జీవన ప్రమాణాలు మెరుగపరచడం, వారి ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయో లేదా, ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకుని పరిష్కరించేందుకే సీఎం ఆదేశాలతో 'గడప గడపకు మన ప్రభుత్వం' పేరిట ప్రతీ ఇంటికి వస్తున్నామని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 98 శాతం నాలుగేళ్ల పాలనలోనే అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని చెప్పారు. జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొకం అప్పారావు, బత్తి శ్రీనివాసరావు, యడ్ల కిశోర్, సీర తాతబాబు, ముసలినాయుడు, గేదెల శాంత, జగ్గన్నదొర తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం మరమ్మతులకు రూ.10 లక్షలు


వసతిగృహంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

చీపురుపల్లి: పట్టణంలోని బీసీ సంక్షేమ బాలుర సమీకృత వసతిగృహంలో అత్యవసర మరమ్మతుల కోసం జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంజూరు చేశారని మండల ఇంజనీరింగ్ అధికారులు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ తెలిపారు. వసతిగృహాన్ని బుధవారం వారు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ వసతిగృహంలో సమస్యలు గుర్తించిన జెడ్పీ చైర్మన్ వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేశారన్నారు. రూ.10 లక్షలతో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సదుపాయం తదితర పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. తక్షణమే పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారి డి.రమేష్‌కు నాయకులు సూచించారు. ఎంపీటీసీ గిరడ రాందాసు, పీతల మురళి, వసతిగృహ సంక్షేమాధికారులు సత్యనారాయణ, కొండమ్మ పాల్గొన్నారు.